

# కథా కౌముది

## నేను మాత్రం..!?

తమిళ మూలం: శివశంకరి
తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్


రచయిత్రి

**కాళ్ళు** చాపుకుని చాపమీద పడుకున్న విశాలాక్షికి ‘అమ్మయ్య!‘ అని అనిపించింది. ఎంత పెద్ద పని సవ్యంగా ముగిసింది!? ఒంటరిగా బ్రతికే ఆడదే అయినా నలుగురూ మెచ్చుకునే విధంగా కూతురుకి పెళ్ళి చేసి అత్తారింటికి పంపించడం అంటే మాటలా?

అంతా ఏడుకొండల వాడి దయ. కామాక్షి పిన్నిగారి సాయం మాత్రం లేకపోతే కూతురి పెళ్ళి గురించి అసలు ఆలోచించగలిగేదా?

కార్లు, బంగళాలు లేకున్నా వియ్యంకులు అంతస్తుగలవాళ్ళే, అల్లుడికి స్కూటర్ ఉంది. ఉన్న ఇల్లు పెద్దకొడుక్కి సొంతం. "పాపా! పాపా!" అంటూ ప్రేమగా చూసుకునే అత్తగారు. పెళ్ళికి పట్టుచీర, మంగళ సూత్రాలు అన్నీ వాళ్ళు తెచ్చినవే?

"వదినగారూ! మీ పరిస్థితి నాకు తెలుసు. అనవసరంగా అప్పు చేసి కష్టపడకండి. మీ అమ్మాయి మా ఇంట్లో మహలక్ష్మిలా అడుగుపెడితే అంతేచాలు."

ఎవరు ఉంటారు ఇలా? ఈ కలికాలంలో ఎవరు అంటారు ఇలా?

ఈ సంబంధం కుదరడానికిదారి చూపించిన కామాక్షి పిన్నికి గుడి కట్టించి మూడుపూటలా ప్రదక్షిణం చేసినా తక్కువే.

"విశాలాక్షీ! కూతురు పెళ్ళీడు కొచ్చిందని, త్వరగా పెళ్ళి చేసేయాలని నువ్వు రోజూ మొర పెట్టుకుంటూ ఉంటావు కదూ. ఆ దేవుడు నీ మొర ఆలకించినట్లున్నాడు. నిన్న మా ఆడపడచు కూతురికి సీమంతం అని భువనగిరికి వెళ్ళాను కదా. అక్కడ సుభద్రని చూసాను. సుభద్ర ఎవరో నీకు చెప్పలేదు కదూ. మా ఆడపడుచు కూతురు పంకజం లేదూ! వాళ్ళ ప్రక్కింటావిడ. వాళ్ళాయన పోయి నాలుగేళ్ళు అవుతుందట. నలుగురు కొడుకులు. ఉమ్మడి కుటుంబం. పెద్దబ్బాయి వకీలు. రెండోకొడుకు మెకానిక్ షాప్ నడుపుతున్నాడు. ఆఖరు కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. అన్నీ ఉన్నా ఏం ప్రయోజనం చెప్పు? ఏదో శాపం తగిలినట్లు ఇద్దరు ఆడపిల్లల్ని దిక్కులేని వాళ్ళలాగా వదిలేసి అర్ధాంతరంగా పెద్దకోడలు రెండేళ్ళ క్రితం చనిపోయిందట, రెండో కోడలికి ఉన్నట్టుండీ పక్షవాతం వచ్చి ఒక చేయి, కాళు పడిపోయి ఆరునెలలుగా మంచం మీదే ఉందట. పాపం! వింటుంటే చాలా కష్టంగా అనిపించింది. పెద్దకొడుకుని "మళ్ళీ పెళ్ళీ చేసుకోరా. నాకూ ఇంట్లో కాస్త సాయంగా ఉంటుంది" అని ఆ తల్లి బ్రతిమాలిందట. కానీ అతగాడు ఒప్పుకోలేదట" పెద్దవాళ్ళిద్దరూ

సన్యాసుల్లా బ్రతుకుతున్నారు. మూడోవాడికైనా గుణవతి అయిన అమ్మాయి భార్యగా రావాలి మా ఇల్లు కళకళలాడాలి' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. 'డబ్బు దస్కం ఏమీ వద్దు. ఆస్తులు, అంతాస్థులు, అందచందాలు లేకున్నా ఫరవాలేదు. గుణవంతురాలైతే చాలు' అని సుభద్ర అన్నప్పుడు నాకు మన జయ జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆవిడతో చెప్పాను. 'వంటామె కూతురైతే మాత్రం ఏమైంది. స్కూల్ ఫైనల్ దాకా చదివింది. నోరెత్తని పిల్ల, గుణవంతురాలు, చుడ్డానికీ బాగానే ఉంటుందని మీరే అంటున్నారు. ఇంకా ఏం కావాలి? వచ్చే శుక్రవారం పెళ్ళి చూపులకి వస్తామని చెప్పండి' అన్నారావిడ. విశాలాక్షీ! నీ కూతురుకి కళ్యాణ గడియ వచ్చేసింది సుమా."

అవును మరి. ఆ కళ్యాణ ఘడియ రాకపోతే శుక్రవారం పెళ్ళిచూపులు అవగానే ఆ చేత్తోనే తాంబూలాలు మార్చుకుని సరిగ్గా ఎనిమిదోరోజు యాదగిరి గుట్టలో పెళ్ళి జరిపించి, మొన్న భువనగిరిలో శోభనం అయ్యాక జయను అత్తగారింట్లో దిగబెట్టి మళ్ళీ నేను ఇలా హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాను అంటే అది జరిగే పనేనా?

కళ్ళు మూసుకున్నా విశాలాక్షికి నిద్ర వచ్చేట్లు లేదు. అటూ ఇటూ పొర్లింది. లేచి కూజా నుంచి నీళ్ళు వంపుకుని త్రాగింది.

ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి కదూ, ఆ మనిషిని పాడె మీద పడుకోబెట్టి ఎన్నో యుగాలుగా వైధవ్యం అనుభవిస్తున్నట్లుగా దుఃఖం ఇంకా పచ్చిగా మనసును తొలిచేస్తుంది.

లోకంలో ఇంత మంది మగవాళ్ళు ఉండగా ఆ దిక్కుమాలిన టి.బి ఈయనకే రావాలా!? మొదట్లో ఏదో మామూలు దగ్గు, జ్వరం అని అశ్రద్ధ చేశాడు కృష్ణమూర్తి. మిరియాల కషాయం, కరక్కాయల చూర్ణం అంటూ వంటింటి వైద్యంతో సరిపెట్టుకున్నాడు. ఇంకాస్త విషమించగానే వేడిచేసినట్లుందని ఆవుపాలతో మిరియాలపొడి, పటిక బెల్లం కలిపి తాగాడు. ఇలా చిట్కా వైద్యాలు చేస్తూ రోజులు రోజులు గడిచే సరికి రోగం. బాగా ముదిరిపోయింది. ఆ తర్వాత గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్ళి చూపించుకున్నాడు.

ఒకరోజు రాత్రి లేచి కూర్చుని ఊపిరి అందనట్లుగా దగ్గాడు. "గుండెలో నొప్పిగా ఉంది విశాలాక్షీ!" అన్నాడు. విశాలాక్షి గబగబా తవుడు వేయించి కాపడం పెడుతుండగానే "తల బ్రద్దలవుతున్నట్లుగా ఉంది విశాలాక్షీ!" అంటూ భళ్ళున రక్తవాంతి చేసుకున్నాడు. అంతే! ఆ క్షణమే ప్రాణం పోయింది.

జీవితాంతం తోడుగా ఉంటాడనుకున్న మనిషి అర్ధాంతరంగా చనిపోయినప్పుడు విశాలాక్షికి ఇరవైఎనిమిదేళ్ళు. కూతురు జయకు తొమ్మిది నిండి పదో ఏడు.

దిక్కు తోచక తోడబుట్టిన అన్నగారింటికి వెళ్ళింది. ఆరునెలలు కూడా అక్కడ ఉండలేకపోయింది. వదిన పరమ గయ్యాళి మూడు ముద్దలు పడేసి తనచేత గాడిద చాకిరి చెయించుకున్నందుకు కూడా విశాలాక్షి బాధపడలేదు. కానీ తొమ్మిదేళ్ళ పసిదానికి చద్దన్నం మాత్రం పెట్టి, బావినుంచీ నీళ్ళు తోడించడం, ఇంట్లో ఉన్న గంగాళాలు, బకెట్లు ఆఖరికి గ్లాసు కూడా వదలకుండా నీళ్ళు నింపమని పురమాయించడం, అందినప్పుడల్లా చావబాదడం... అన్నీ చూసాక ఓర్చుకోలేకపోయింది. అన్నగారింటి నుంచీ బయలుదేరి మేనమామ ఇంటికి వెళ్ళింది.

అన్నగారిల్లు మండే పొయ్యి అంటే మేనమామ ఇల్లు కాలే పెనం అని నెల తిరక్కముందే విశాలాక్షికి అర్ధమయ్యింది.

అత్తయ్య ఊళ్ళో పెత్తనానికి బయలుదేరిన సమయంలో మేనమామ "హి...హి" అంటూ పళ్ళికిలించడం మొదలు పెట్టాడు. కాఫీగ్లాసు ఇస్తే చెయ్యి తగిలేటట్లు అందుకునేవాడు. రోజంతా చూపులతో వెంటాడేవాడు.

ఒకరోజు అత్తయ్య గుడికి వెళ్ళిన సమయం చూసి వీధి తలుపు గొళ్ళెం పెట్టి లోపలికి వచ్చాడు. రోట్లో పచ్చడి దంచుతున్న విశాలాక్షి వెనక నుంచి గట్టిగా కావలించుకున్నాడు.

"విశాలా! మిస మిసలాడే నిండు యవ్వనాన్ని ఇలా వృధా చేయవచ్చా? అత్తయ్య ఇప్పట్లో రాదులే. బుద్ధిగా నేను చెప్పినట్లు విన్నావంటే, నీకేం కావాలో అన్నీ నేనే చూసుకుంటాను. అర్ధం అయ్యిందా? అనవసరంగా బెట్టు చేయకు" అంటూ గుసగుసలాడాడు.

విశాలాక్షిని వెనకనుంచీ గట్టిగా కావలించుకున్నాడు.

విశాలాక్షి చేతిలో ఉన్న రోకలిని మామయ్య కాలి మీద దబ్బున వేసింది. "దుర్మార్గుడా! నీ మనసులో ఏమనుకుంటున్నావు? అత్తయ్య ముఖం చూసి వదిలిపెడుతున్నాను. లేకపోతే రోకల్ని నీ నెత్తి మీదే వేసేదాన్ని. కుక్కచావు చస్తావు. " అదిరే గుండెలతో ఆవేశంగా అరిచింది. ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా మూలనున్న బట్టల సంచి తీసుకుని, వీధిలో ఆడుకుంటున్న జయతో సహా అక్కడినుంచీ బయలుదేరింది.

అక్కడనుంచీ నేరుగా తాను ముందు కాపురం ఉన్న ఇంట్లో వెనక పోర్షన్‌లో ఉంటున్న గుండమ్మ దగ్గరికి వెళ్ళింది.

"నాకు ఏ దిక్కూ లేదు పెద్దమ్మా! ఈ లోకంలో మొగుడు పోయినదానికి ఒక్కొక్క అడుగులోనూ ఆపద పొంచి ఉంటుందన్న సంగతి బాగా అర్థమయ్యింది. ఈ బొందిలో ఊపిరి ఉన్నంతవరకు సీతమ్మగారిలాగే బ్రతకాలని అనుకుంటున్నాను. నాకు సాయం చేయండి. మిమ్మల్నే నమ్ముకుని కొండంత ఆశతో వచ్చాను." పెద్ద పెట్టున ఏడ్చింది విశాలాక్షి.

గుండమ్మ పన్నెండేళ్ళ వయసులోనే పెద్దమనిషి కాకముందే పసుపుకుంకుమలు కోల్పోయి గుండు గీయించుకుంది. బంధువులు, తెలిసిన వాళ్ళు అంటూ ఎవరింటికీ వెళ్ళకుండా స్వశక్తినే నమ్ముకుని బ్రతుకు తెరువు చూసుకుంది. పెళ్ళిళ్ళకి పండగలకీ స్వీట్లు, కారా చేయడంలో చేయి తిరిగిన మనిషి.

వైధవ్యం ఎంత భయంకరంగా ఉంటుందో స్వయానా అనుభవించి ఉన్నందువల్ల పెట్టకోడి తన పిల్లలకి రెక్కల క్రింద ఆశ్రయం ఇచ్చినట్లు రెండుచేతులూ చాపి విశాలాక్షి, జయలను అక్కున చేర్చుకుంది గుండమ్మ.

తొలిరోజుల్లో పిండి మరకి వెళ్ళి బియ్యం పిండి ఆడించుకుని రావడం, జంతికలకి పిండి కలపడం. జంతికల్ని దోరగా వేయించడం అంటూ మొదలుపెట్టి కాలక్రమేణా గుండమ్మకి వారసురాలిగా పేరు సంపాదించుకుంది. స్వీట్లు, కారాలు చేయడంలో గురువుని మించిన శిష్యురాలిగా విశాలాక్షి తయారయ్యేసరికి కాలగర్భంలో ఏడు సంవత్సరాలు కలిసిపోయాయి.

ఈ మధ్య కాలంలో జయ స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాసింది. చూస్తుండగానే రేసు గుర్రంలాగా మంచి నిగారింపుతో ఏపుగా ఎదిగింది. నల్లగా నిగనిగలాడే తలకట్టు, అంగసౌష్టవం చూసే వాళ్ళ దృష్టిని తమ వైపు తిప్పుకునేలా చేసాయి.

వంటామె కూతురికి ఇంత అందం ఎందుకు అన్న భయం పట్టుకుంది విశాలాక్షికి. వంట పని మీద ఎవరింటికైనా వెళ్ళినప్పుడు "కూతురు పెళ్ళీడుకొచ్చింది రోజులు చూస్తే బాగా లేవు. కట్టుకున్న మొగుడు పోయాడు. చేతిలో చిల్లిగవ్వలేదు. ఒంటరి ఆడదాన్ని. నేనేం చేయగలను? కూతురికి పెళ్ళి చేసి ఈ భారాన్ని ఎలా దింపుకోనూ?" అంటూ కనబడ్డ ప్రతి మనిషి దగ్గరా తనగోడు వెళ్ళబోసుకునేది.

విశాలాక్షి ఏ ముహూర్తాన అలా అన్నదో గానీ జయకి వెంటనే పెళ్ళి సంబంధం కుదిరింది. లేకపోతే ఇంత మంచి సంబంధం తనని తానుగా వెతుక్కుంటూ వాకిట్లోకి వస్తుందా?

మంచినీళ్ళు తాగి మళ్ళీ వచ్చి చాపమీద పడుకున్న విశాలాక్షికి పెళ్ళికోసం చేసిన అప్పు గుర్తుకు వచ్చింది. అప్పు తీర్చాలంటే ఎన్ని నెలలు పడుతుందో మనసులోనే లెక్కవేసి చూసుకుంది.

కార్యం కూడా అయిపోయింది. ఇక ఏ నిమిషమైనా శుభవార్త రావచ్చు. ముప్ఫై ఆరేళ్ళు నిండకుండానే తను అమ్మమ్మ కూడా అయిపోతుంది అని అనుకోగానే విశాలాక్షికి సంతోషంగా అనిపించింది. ఆ సంతోషంలో పెదాల మీద చిరునవ్వు మెదులుతుండగానే వీధి తలుపును ఎవరో దబదబా బాదినట్లు శబ్దం వినిపించింది.

లేచి తలుపులు తీసిన విశాలాక్షి స్థంభించినట్లుగా నిలబడిపోయింది.

జయేనా ఇది! రేగిన జుట్టు, ఏడ్చి ఏడ్చి వాచిపోయిన ముఖం! ఏమైంది తనకి?

"ఏమైంది జయా? ఏం జరిగింది?"

జయ లోపలికి వచ్చి మూలగా గోడకి చేరగిలబడి కూర్చుంది.

"ఏం జరిగింది జయా? చెప్పి చావు."

"....."

"నీవేమైనా తప్పు చేసావా? అల్లుడుగారు నిన్ను కొట్టారా? అత్తగారేమైనా కోప్పడిందా?"

"..."

"అత్తగారింట్లో ఎలా మసులుకోవాలో తెలియక వాళ్ళకి తలవంపులు కలిగేలా ఏదైనా పిచ్చి పని చేసావా?"

"....."

"దేవుడి దయవల్ల నీ మెడలో మూడుముళ్ళు పడ్డాయని నేను సంతోషిస్తుంటే అదికాస్తా హరించుకుపోయేలా ఏదైనా ముదనష్టపు పని చేసావా?"

పావుగంట... అరగంట దాటింది. విశాలాక్షి కూతురిని బ్రతిమాలింది. కళ్ళెర్ర చేసింది. ఫలితం మాత్రం శూన్యం.

దేనికీ నోరు విప్పకుండా మౌనంగా ఉన్న జయను చూస్తే విశాలాక్షిని శివం ఎత్తినట్లయింది. పూనకం వచ్చిన దానిలా ఊగుతూ కూతురి జడలు పట్టుకుని గట్టిగా ఊపింది.

"ఇలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటే ఏమనుకోవాలి నేను? నీ మనసులో ఏమనుకుంటున్నావు? ఒళ్ళు బలుపెక్కి పులిసిపోయిందా? శ్రీరాముడిలాంటి భర్తనీ, కౌసల్యాలాంటి అత్తగారిని వదిలేసి ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఇప్పటికిప్పుడు నిన్ను మీ అత్తగారింట్లో దిగ బెట్టి వచ్చిన తర్వాతే నాకు మనశ్శాంతి. మొదట లేచి రావే."

అంత సేపూ పిచ్చిదానిలా చూస్తూ కూర్చున్న జయ చటుక్కున తలతిప్పి కళ్ళు పెద్దవి చేసి తల్లివైపు చూస్తూ కూర్చున్న జయ చటుక్కున తలతిప్పి కళ్ళు పెద్దవి చేసి తల్లివైపు చూసింది.

'అమ్మా! ఏమన్నావు? రాముడిలాంటి భర్త, కౌసల్యలాంటి అత్తగారు అనా? లేదమ్మా లేదు. ఆవిడ ఒక కుంతి. దొరికిన దాన్ని సమంగా పంచుకోండి అని తన కొడుకులతో చెప్పిన నవీన కుంతి ఈమేనమ్మా."

"ఏమిటే జయ! ఏమిటినువ్వంటున్నది?"

"జీవితాంతం సీతమ్మవారిలాగా ఉండాలన్న కోరిక నీకు ఈ వయస్సులో కూడా ఉన్నప్పుడు నన్ను మాత్రం ద్రౌపదిలాగా బ్రతకమని ఎందుకు వెళ్ళగొడుతున్నావు? నేను మాత్రం ద్రౌపదిగా ఎందుకు బ్రతకాలి?"

నీళ్ళు నిండిన కళ్ళతో ఆవేశంగా అన్న జయ, తల్లిని పట్టుకుని నిశ్శబ్దంగా ఏడవసాగింది.



చెన్నై వాస్తవ్యులైన గౌరి గారు తెలుగు నుంచీ తమిళంలోకీ, తమిళంనుంచీ తెలుగులోకీ అనేక కథలూ, నవలలూ అనువాదం చేసారు. వీరి అనువాదాలు తెలుగు-తమిళ భాషలలోని అన్ని ప్రముఖ పత్రికలలోనూ ప్రచురించ బడుతున్నాయి.